మహేశ్వరం ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే సబితారెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన మహేశ్వరం నియోజకవర్గం ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని షాహీన్‌నగర్‌లో గురువారం ఆమె 77 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాటు విజయవంతంగా ఈ పథకాన్ని అమలు చేశారన్నారు. తనపై పూర్తి విశ్వాసం ఉంచి గెలిపించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇకపై మరింత బాధ్యతాయుతంగా పని చేస్తానన్నారు. చెక్కులు గతంలోనే మంజూరయ్యినప్పటికీ.. ఎన్నికల కోడ్ కారణంగా అందించలేకపోయామని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారాన్ని కలిపి ఇవ్వాలన్నారు. ఈ ఒక్కరోజే బాలాపూర్ మండల పరిధిలో 179 మంది లబ్ధిదారులకు రూ.1.79 కోట్ల చెక్కులు అందించానని తెలిపారు. కార్యక్రమంలో జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డి, జల్‌పల్లి కమిషనర్ ఎస్.వసంత, నాయకులు యూసుఫ్ పటేల్, షేక్ అఫ్జల్, లక్ష్మీనారాయణ, శంషాద్దీన్, యాహ్యా, ఉమర్ బామ్ పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్

తుక్కుగూడ: ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, మంఖాల్, రావిర్యాలలో ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే సిబ్బంది సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. దరఖాస్తు చివరి గడువు 6న ముగియనుంది. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమం

కందుకూరు: మండల పరిధిలోని కొలన్‌గూడ, బేగరికంచె, కటికపల్లి, జబ్బార్‌గూడ, మీర్‌ఖాన్‌పేట గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మొత్తం ఈ రోజు 1467 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీఓ వెంకట్రాములు తెలిపారు.

సమస్యలపై చర్చించండి

కార్పొరేటర్ శ్రీవాణి



నగర మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్‌రోస్‌లను గురువారం సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కలిసింది. నగరంలో పేరుకుపోయిన సమస్యలను చర్చించేందుకు ప్రతి మూడు నెలలకోసారి పాలక మండలి సమావేశం ఏర్పాటు చేయాలని, ఆస్తి పన్ను ఎగ్గొడుతున్న బడా వ్యాపారవేత్తలు, సినిమా హాళ్లు, షాపింగ్‌మాల్స్, హోటల్స్‌పైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అక్రమ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో ఫైర్‌సేఫ్టీ నిబంధనలను పరిశీలించాలని కోరారు. అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని, కల్తీ ఆహారంపై నివారణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు శ్రీవాణి తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



రామ్‌రెడ్డిని సన్మానిస్తున్న గురుస్వామి శివసాయి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించి, ఇరుముడితో శబరిమలకు స్వాములు బయలుదేరారు. శివసాయి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి పూజలు, భజనలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. అయ్యప్ప స్వాములు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ పట్వారి జైన్ రామ్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రామ్‌రెడ్డిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

పెద్దూర్ తండాలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని పెద్దూర్ తండాలో గురువారం అయ్యప్ప స్వాములు పడి, మెట్లు, ఇనుముడి పూజలు ఘనంగా నిర్వహించారు. ఇనుముడి కట్టు అంటూ అయ్యప్ప నామ కీర్తనలు ఆలపించారు. ప్రాంగణమంతా అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. కన్నుల పండువగా కొనసాగిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీశైలం, సక్రి, కిషన్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, శ్రీను, భిక్షపతి, పణీందర్, రమేశ్, అభిషేక్, అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న గురూజీ దంపతులు తదితరులు

ఘనంగా దత్తా, అనగాదేవి వ్రతం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో గురువారం దత్త, అనగాదేవి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో దత్తాత్రేయుడు, అనగాదేవి విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దంపతులతో దత్త, అనగాదేవి వ్రతాన్ని చేయించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



దత్తా, అనగాదేవి వ్రతం చేస్తున్న భక్తులు

హుండీ ఆదాయం లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సర్పంచ్, ఈఓ, ఆలయ కమిటీ సిబ్బంది

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. గురువారం సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆదాయం రూ. 48,177 వచ్చినట్లు ఈఓ స్నేహలత తెలిపారు. కార్యక్రమంలో ఈఓ స్నేహలత, సీనియర్ అసిస్టెంట్ రవి, క్లర్క్ ఆంజనేయులు, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు దేవేందర్‌రెడ్డి, చంద్రయ్య, మాజీ సర్పంచ్ మణెమ్మ, యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, యాదయ్య, ఆలయ మాజీ కమిటీ చైర్మన్ శ్రీశైలం యాదవ్, హరిమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రవణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల అందజేత

యాచారం: మండల పరిధిలోని నల్లవెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలు అందజేశారు. మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు తన తల్లి రాచర్ల ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. భవిష్యత్తులో కూడ పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, నాయకులు కానమోని జంగయ్య, కొండల్, వెంకటయ్య, హరికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: శిథిలమైన ఆలయాల మరమ్మతులతో పాటు నూతన ఆలయాల నిర్మాణం కోసం తోడ్పాటు అందిస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని దాస్య తండాలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఆలయ నిర్మాణానికి సాయం అందించాలని తండావాసులు జెడ్పీటీసీని కోరారు. గురువారం ట్రస్ట్ సభ్యులు, గౌడసంఘం కల్వకుర్తి తాలుక అసెంబ్లీ కన్వీనర్ మొక్కురాల అశోక్‌గౌడ్ ద్వారా రూ.లక్ష తండావాసులకు జెడ్పీటీసీ అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సక్రునాయక్, దశ్రునాయక్, అశోక్‌గౌడ్, బక్కనాయక్, గోపాల్‌నాయక్, భీమా నాయక్, సక్రియానాయక్, రమేశ్‌నాయక్, రవి, వినోద్, భాస్కర్, పాండు, చంద్రయ్య, బిల్యా, శంకర్, అశోక్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్షింతలు పంపిణీ



పంపిణీకి తెచ్చిన రాములోరి అక్షింతలు

కందుకూరు: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మండల పరిధిలోని దెబ్బడగూడలో గురువారం శ్రీరామ భక్తులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణి, రామ భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికి అక్షింతలు

తుక్కుగూడ: అయోధ్య రాములోరి అక్షింతలు మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్‌లో గురువారం ఇంటింటికి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షింతలను శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచి, ప్రత్యేక పూజలు, భజన చేశారు. అనంతరం వాటిని ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కందుకూరు: మండల పరిధిలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు 6వ తేదీన (శనివారం) ఎమ్మెల్యే సబితారెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ గోపాల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉ.10.30 గంటలకు మండల పరిషత్ సమావేశపు హాల్‌లో కార్యక్రమం జరగనుందన్నారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ.40 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి గోపిరెడ్డి మాధవ రెడ్డి మెమోరియల్ ట్రస్టు రూ. 40 వేలు విరాళంగా ఇచ్చింది. అమెరికాలో ఉంటున్న ట్రస్ట్ చైర్మన్ గోపిరెడ్డి సంజీవరెడ్డి కుటుంబ సభ్యులు గురువారం ఈ విరాళం మొత్తాన్ని అందజేశారు. భువనేశ్వర్ ఐఐటీలో చదువుతున్న అనాథ విద్యార్థి రాజా నాయక్, మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్న అనాథ విద్యార్థి మహాకాళి చదువుకు ఈ డబ్బు వినియోగించాలని గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు మాధవ రెడ్డి మెమోరియల్ ట్రస్టు సభ్యుడు తుమ్మలపల్లి రాజేష్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో శేఖర్ రెడ్డి, రాజేష్ రెడ్డి,ఆండాళ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి బదిలీ



హస్తినాపురం: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని వనస్థలిపురం పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దేప జలేంధర్‌రెడ్డిని మల్టీజోన్-2కు బదిలీ అయ్యారు. బుధవారం హైదరాబాద్ మల్టీజోన్-2 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇచ్చిన బదిలీ ఉత్తర్వుల మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు సీఐలను రిలీవ్ చేసినట్లు తెలిసింది. వనస్థలిపురం సీఐగా గతేడాది మార్చి 31న బాధ్యతలు చేపట్టిన జలేంధర్ రెడ్డి తొమ్మిది నెలలకే బదిలీ కావడం విశేషం.

టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా మహేశ్



హయత్‌నగర్: హైదరాబాద్ జిల్లా టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా హయత్‌నగర్‌కు చెందిన పారంద మహేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు జనరల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న తన సేవలను గుర్తించి ఆ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర బీజేపీ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన

తుర్కయంజాల్: స్వయం ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధ్యమని ఎయిర్ వాటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ప్లాంట్ ప్రతినిధి జయరామన్ అన్నారు. గురువారం టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో షైన్ సంస్థ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరి పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి క్రీడలు దోహదం

కడ్తాల్: ఆరోగ్యకర సమాజానికి క్రీడలు దోహదపడుతాయని సీఐ శివప్రసాద్ అన్నారు. యువజన సంఘాల ఐక్యవేదిక- వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్‌తో కలిసి సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. పభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, ఉద్యమ నాయకుడు వెంకటేశ్, వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



మీర్‌పేటలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న సబితారెడ్డి

మీర్‌పేట: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన 44 చెక్కులను గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ అల్లూరి వాణి, ఫ్లోర్‌లీడర్లు భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రజాక్, పల్లె జంగయ్యగౌడ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఎల్బీనగర్‌ను రోల్‌మోడల్‌గా చేస్తాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సాగర్ రింగురోడ్డులో స్కైఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించి ఎల్‌బీనగర్‌ను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం సాగర్‌రింగ్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న స్కైఫ్లైఓవర్ పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ చౌరస్తాను సిగ్నల్ ఫ్రీ చౌరస్తాగా మార్చామని, ఎస్ఆర్‌డీపీ పనుల్లో భాగంగా దాదాపు 658 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపడతామని అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని అన్ని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ పనులు పూర్తయ్యాయని, ఎల్‌బీనగర్ జంక్షన్ వద్ద కుడి, ఎడమ ఫ్లైఓవర్లు అండర్ పాస్‌లు నాగోలు జంక్షన్ ఫ్లైఓవర్ కామినేని జంక్షన్ వద్ద రెండువైపులా ఫ్లైఓవర్లు చింతల కుంట జంక్షన్‌వద్ద అండర్‌పాస్, బైరామల్‌గూడ అలేఖ్య టవర్స్ జంక్షన్ వద్ద రెండు ఫ్లైఓవర్లు నిర్మించామని, ప్రస్తుతం అలేఖ్య టవర్స్ వద్ద సెకండ్ లెవల్ నూతన స్కైఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెల్లడించారు. సంక్రాంతి పండుగ వరకు పనులు పూర్తి స్థాయిలో జరుగుతాయని, ఈ స్కై ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవన్నారు. కరోనా సమయంలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం వల్లే రోడ్డు వెడల్పు పనులు, ఫ్లైఓవర్ పనులు వేగవంతంగా పూర్తి చేశామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, గజ్జెల మధుసూదన్‌రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, మధుసాగర్, మహేశ్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు అండగా ఉంటాం



నగదు అందజేస్తున్న విఠల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం పరిధిలోని రైతు కుటుంబాలకు అండగా ఉంటామని ఆ సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన బాటసింగారం రైతుసేవా సహకార సంఘం సభ్యురాలు బీరగోని శంకరమ్మ డిసెంబర్ 6న మృతి చెందారు. సహకార సంఘం తరపున మృతురాలి భర్త రంగయ్యకు గురువారం రూ.25వేల ఆర్థిక సాయాన్ని విఠల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాములు, మహిపాల్‌రెడ్డి, అబ్దుల్లాపూర్ సర్పంచ్ కిరణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

సారూ.. ఈ స్తంభాలను తొలగించరూ!

- రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు
- రాకపోకలకు అవస్థలు



సచివాలయనగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

ఎల్‌బీనగర్: రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల కాలనీ రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోందని సచివాలయనగర్ కాలనీవాసులు వాపోతున్నారు. అసలే ఇరుకు రోడ్డు... ఆపై రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా అవస్థలు పడుతున్నామని, దానిని తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని పలువురు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో స్తంభాలు ఉండటం వలన అక్కడ చెత్త పేరుకుపోతోందని తెలిపారు. గతంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారని, అయినా తొలగించలేదని పలువురు కాలనీవాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపటితో ముగియనున్న గడువు

ఇబ్రహీంపట్నం: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు శనివారంతో గడువు ముగియనున్నట్లు స్థానిక నల్లకంచె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లీలావతి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో చేరేందుకు 2023-24 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశపరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. మరింత సమాచారం కోసం గురుకుల వెబ్‌సైట్, టోల్ ఫ్రీ నంబర్ 180042545678 సంప్రదించాలన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- రోజురోజుకూ పెరుగుతున్న వైనం
- కొనలేక జనం ఇబ్బందులు



వనస్థలిపురం రైతుబజారు

వనస్థలిపురం: రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలో కూరగాయల ధర రూ. 50 మొదలుకొని రూ.100 వరకు చేరుతుండటంతో కూరగాయలు కొనలేక గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ. 200 నుంచి 300 పెడితే వారం రోజులకు సరిపడా కూరగాయలు వచ్చేవని, నేడు రూ. 500 నుంచి 600 పెట్టినా వారానికి సరిపడే కూరగాయలు రావడం లేదని వారు వాపోతున్నారు. నాన్‌వెజ్‌లకు దీటుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయని, ఇక కూరలు వండుకునేది ఎట్లా తినేది ఎట్లా అని వారు దిగాలు పడుతున్నారు.

- ప్రస్తుతం రైతుబజారుల్లో, బహిరంగ మార్కెట్లలో కొన్ని రకాల కూరగాయలు తప్ప మిగతా కూరగాయల ధరలు రూ.50కి చేరువలో, కొన్ని రూ. 50కి పైనే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గతంలో రూ. 20, 30 పెడితే కిలో కూరగాయలు వచ్చేవని, ఇపుడు రూ. 50 నుంచి 75 ధరల్లో కిలో లభ్యం అవుతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. ఇంతకుముందు కిలో కొన్నచోట ప్రస్తుతం అరకిలో, పావుకిలో కొని సరిపెట్టుకోవాల్సి వస్తోందని వారు అంటున్నారు.
- గురువారం రైతుబజార్లలో కిలో వంకాయ ధర రూ. 45, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ.45, కాకర రూ. 55, బీర రూ. 45, బీన్స్ రూ.45, కేరెట్ రూ.38, దొండ రూ.45, చిక్కుడు రూ.55, గోకర రూ.50, క్యాప్సికం రూ.70, దోస రూ.35, చామగడ్డ రూ. 55 ఉన్నాయి. ఆకుకూరలు సైతం గతంలో రూ. 10కి 5, 6 కట్టలు వచ్చేవి..ప్రస్తుతం ఒక్క కట్టకు రూ, 10 నుంచి 20 పెట్టాల్సి వస్తోంది. కాగా రైతుబజారుల్లోనే ఈ ధరలు ఉండగా బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ. 20 నుంచి 30 అదనంగా ధరలు ఉన్నాయని, ఏ కూరగాయలైనా పావుకిలోకు రూ. 20 చొప్పున వసూలు చేస్తున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. దీంతో కిలోల లెక్కన కూరగాయలు కొనలేక అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకోవాల్సివస్తోందంటున్నారు.